

# వైకుంఠయాత్ర

## – మల్లాది వెంకట కృష్ణమూర్తి

*(గత సంచిక తరువాయి)*

**"అంటే?"**

"అంటే మీ జీవితం నాకు అద్దెకిస్తారా అని పర్మినెంట్‌గానే సుమా. మా అమ్మ 'నో'" అనదు.

"ఓ...మీ అమ్మగారి పేరు?"

"ఆవిడ్ని అడిగితే చెప్తుందిగా."

"నా గురించి చెప్పారా?"

"పూర్తిగా."

"ఓ.కె. ఎప్పుడు రాను."

"రేపు సాయంత్రం."

"రైట్ నన్ను పెళ్ళిచేసుకోవా? అని మీరడిగిన విధానాలు నాకు నచ్చాయి."

"మీకు నచ్చే విధంగా ఇంకా చాలాసార్లు అడుగుతాను ఎన్ని వందల విధాలుగా అడిగినా తనివి తీరని ప్రశ్న అది."

"నాక్క్యూడా" చెప్పింది వెన్నెల.

"మీ ఫోటో నాకెందుకివ్వకూడదు?"

"నా ఫోటోని మీరెందుకు అడగకూడదు?"

"ఆల్‌రైట్. రేపు మా ఇంటికొచ్చేటప్పుడు మీ ఫోటో తీసుకురండి మీ గడ్డం పక్కనున్న డింపుల్ చక్కగా కనపడేలా?"

"ఐ యామ్ థాంక్ ఫుల్ టు మై సింపుల్."

"అది లేకపోయినా మీరు నాకు నచ్చారు బట్ దాంతో యింత రెట్టింపు నచ్చారు."

"...."

"....."

ప్రేమికుల మధ్య కమ్యూనికేషన్ ఎప్పుడూ అందంగా ఎక్సైటింగ్‌గా వుంటుంది. ఒకరి గొంతు ఇంకొకరు వినడం, ఒకరి చేతి రాత ఇంకొకరు చదవడం, ఒకరి సాన్నిధ్యంలో ఇంకొకరు గడపడంలో ప్రేమ సమయంలో ఎంతో అద్భుతంగా వుంటుంది. చూసేవాళ్ళకి అందులో ఇది కనపడదు కాని దాన్ని అనుభవించే జంటకి మాత్రం ఆ 'ఇది' కనిపిస్తుంది.

మరో నాలుగైదు నిమిషాలపాటు వెన్నెల, శివాజీ ఫోన్‌లో మాట్లాడుకుంటూనే వున్నారు. తర్వాత ఇక బావుండదని ఫోన్ పెట్టేశాడు శివాజీ.

తనది వన్ వే ట్రాఫిక్ కాదని, తన ప్రేమను వెన్నెల అంగీకరిస్తుందన్న నమ్మకం శివాజీకి కలిగింది.

మళ్ళీ వెన్నల ఇంట్లో ఫోన్ మోగింది. ఆ ఫోనుని ఎక్స్‌పెక్ట్ చేసిన వెన్నెల రిసీవరు అందుకున్నది.

"హలో?"

"నేనే" అన్న శివాజీ కంఠం వినపడింది.

"చెప్పండి. ఎప్పుడయినా ఫోన్ చేయమన్నానని చేశారా?" అడిగింది నవ్వుతూ.

"కాదు. భారతదేశంలో ఎప్పుడు డ్రయివింగ్ లెఫ్ట్ నుంచి రైట్‌కు మారుతుందో చర్చిద్దామని."

"అదొద్దు. లీటర్స్, కిలోల నుంచి పింట్స్ అవున్సెస్ ఎప్పుడు మారుతామో చర్చించుకుందాం."

"వెన్నెల"

"ఆ"

"నిన్నే."

"ఆ అన్నాగా."

"నిన్ను నిన్నే అంటానికనించి సరేనా?"

"సరే."

"నా పడక గదిలో మనిద్దరం కలిసి తీయించుకున్న ఫోటో ఫ్రేం వుండే అవకాశం వస్తుందా అని అడుగుదామని ఫోను చేశాను. నీ వంటి మీది చీర నా బెడ్‌రూంలోని నా మంచం ప్రక్కనే కుప్పలా పడే అవకాశం వస్తుందా అని అడగడానికి కూడా."

వెంటనే వెన్నెల బుగ్గల్లో వెచ్చటి ఆవిరి.

"చూద్దాం."

"ఓ.కే"

లైన్ కట్ చేసింది.

"ఎవరమ్మా అది?" అడిగింది వెన్నెల తల్లి.

"ఓ క్లోజ్ ఫ్రెండ్ మమ్మీ" జవాబు చెప్పింది వెన్నెల.

10

ఇండియాలోని బంద్ కల్చర్‌కి ఓ పద్ధతి వుంది. ఒక పార్టీ పిలుపునిస్తే భారత్ బంద్ జరుగుతుంది. ఒక ప్రతిపక్ష నాయకుడు పిలుపు ఇచ్చే బంద్ ఆ ప్రతిపక్ష నాయకుడు రాష్ట్రంలోనే జరుగుతుంది. ఓ ఎం.ఎల్.ఏ బంద్ పిలుపునిస్తే అది అతని నియోజవర్గంలోనే జరుగుతుంది. జంట నగరాల్లో బంద్ పిలుపుని పార్టీ కార్యకర్తలిస్తే చాలు.

రామ్‌గోపాల్ హత్యకి నిరసగా కార్యకర్తలు బంద్ నిర్వహించారు. అదే రోజు అతని మృతదేహానికి అంత్యక్రియలు కూడా జరిగాయి. అనేకమంది ఊరేగింపుగా తీసుకెళ్ళారు ఆ మృతదేహాన్ని.

ఆ రోజు నగరంలోగల ఉద్రిక్తత దృష్ట్యా పవన్ బయటికి కదలలేదు. అతని మిత్రులు, అనుయాయులు, గూండాలు అతనింటికి వెళ్ళి రాత్రిదాకా వుండి వెళ్ళారు.

రామ్‌గోపాల్ హత్య ఎవరి పని అయ్యుంటుందా అని చాలాసేపు చర్చించుకున్నారు. అసలు చంపిన వాళ్ళని పోలీసులు పట్టుకుంటే తప ఆ సంగతి బయటికి రాదనుకున్నారు. ఎందరికో ఆ అవసరం అవకాడం వున్నాయి.

పవన్‌ని చూడటానికి వచ్చిన వాళ్ళలో ఆద్రిజ ఒకరు. ఆమె పవన్ క్లాస్‌మేట్. రెండేళ్ళుగా పవన్, ఆద్రిజ ఒకరితో మరొకరు సన్నిహితంగా వున్నారు. అది మానసికమయినదీ, శారీరకమయినదీ కూడా.

ఆ ఇద్దరిలో ఎవరూ అంతదాకా పెళ్ళి గురించిన ప్రస్తావన తీసుకురాలేదు. కానీ ఏదో ఓ రోజు ఆ టాపిక్ తమ మధ్య వచ్చి తీరుతుందని ఇద్దరికీ తెలుసు.

ఆద్రిజని చూడగానే చిరునవ్వుతో అన్నాడు పవన్.

"రా! వార్తలన్నీ విన్నావుగా."

"విన్నాను - చదివాను. అందుకే వచ్చాను. అది నీ పని అని నేననుకోవడంలేదు."

"థాంక్స్ నువ్వయినా అది నమ్మినందుకు."

"చాలా వదంతులు వింటున్నాను" అడిగింది ఆద్రిజ ప్రశ్నార్థకంగా.

"నేను కూడా."

"జాగ్రత్తగా వుండాలి నువ్వు"

"ఈ రాత్రికి కలుద్దామా?"

"బయటకు వస్తావా?" ఆశ, ఆదుర్దా కలగాపులంగా వున్నాయి ఆమె కంఠంలో.

"ఈ టెన్షన్‌కి విరుగుడు నువ్వే."

"నువ్వు బయటికి రావడం నాకిష్టంలేదు. ముఖ్యంగా ఈ రోజు. వైనాట్ యూ స్మగుల్ మి ఇన్?"

కొద్దిక్షణాలు ఆలోచించి చెప్పాడు.

"నీ ఆల్‌రెడీ స్మగుల్ అయి వచ్చేశావు. ఆఫీస్ గదిలోనే వుండు. రాత్రి తొమ్మిదిన్నరకి మా అమ్మ పడుకున్నాక బెడ్ రూంలోకి వద్దువుగాని. కాకపోతే నిన్నిందులో వుంచి తాళం వేస్తాను. రోజూ ఆ పని మా అమ్మచేస్తుంది. కానీ ఇవాళ నేను తాళం వేస్తాను."

ఆద్రిజలో ఎక్స్‌యిట్ మెంట్, భయం తొంగిచూశాయి.

"మరి భోజనం మాటేమిటి?"

"లేట్‌గా తిను."

"డన్."

ఇద్దరికీ ఎంతో ఎక్సయిటింగ్‌గా వుంది ఆ పథకం. సర్వెంటుకి అనుమానం రాకుండా వాడిని ఇంటికి పంపించేశాడు పవన్.

11

కడపరెడ్డి దగ్గరికి వచ్చాడో వ్యక్తి.

"చేతి బాంబులున్నాయా?" అడిగాడు.

"ఎవరికి?"

"చెప్తాను. ఉన్నాయా?"

"ఉన్నాయి"

"ఎంత?"

బాంబుల బరువు, ధర చెప్పాడు. కడపరెడ్డి మాట్లాడకుండా జేబులో కరెన్సీ నోట్లు తీసి కడపరెడ్డికి అందించాడు అతను.

"ఇప్పుడు చెప్పు. ఎవరికి?" కడపరెడ్డి డబ్బులు లెక్కపెట్టుకున్నాక.

"మన ముఖ్యమంత్రికి."

"నిజం చెప్పచ్చుగా."

"అయితే మన ప్రధానమంత్రికి."

"నే చెప్తా నువ్వు నువ్వు వి టును. కుమారస్వామికి కాదా?"

"కాదు."

"ఎవరయితే నాకేం? నేను అమ్మలేదు, నువ్వు కొనలేదు" చెప్పాడు కడపరెడ్డి.

అరగంట తర్వాత వాటిని కుమారస్వామి అవిటి గోవిందుకిచ్చి చెప్పాడు.

"పవన్ పని త్వరగా ముగించు."

అతనికి ఆరువేళ్ళు. అందుకే అతనికి 'అవిటి గోవిందు' అనే నిక్ నేమ్ వచ్చింది. నిజానికది అవిటితనం కాకపోయినా.

12

శనివారం సాయంత్రం 'నింపి' నైట్ క్లబ్‌కి శివాజీ బయలుదేరుతుండగా చెప్పింది పావని.

"వెన్నెల ఈ రాత్రి కూడా క్లబ్‌కి వస్తే రేపు ఉదయం మనింటికి పిలు."

"అలాగేనమ్మా" ఇందాక ఫోన్ చేసినప్పుడు వెన్నెలని అడిగితే మనింటికి వస్తానని చెప్పింది.

"గుడ్ రెంటల్ బుక్ స్టోర్‌లో నెవిల్ షూట్ నవల 'ఆన్ ది బీచ్' ఉంటే అడిగి తీసుకో."

"అలాగే నెవిల్ షూట్ పేరు ఎప్పుడు వినలేదమ్మా?"

"నువ్వు పుట్టకమునుపటి రచయిత. బట్ నువ్వు చదవదగ్గ రచయిత."

"ష్యూర్"

ఎప్పటిలా లోకల్ స్టేషన్‌కి నడిచి వెళ్ళాడు శివాజీ. సెకండ్ క్లాస్ సీజన్ పాస్‌తో ఫస్ట్ క్లాస్‌లో బాంద్రా నుంచి చర్చ్‌గేట దాకా ప్రయాణించాడు. అక్కడనుంచి కాలినడకన 'నింపి'కి చేరుకున్నాడు.

మిస్ డిసౌజా అతన్ని చూడగానే చెప్పింది చిరునవ్వుతో.

"నీ కోసమే చూస్తున్నాను గ్రేట్ ఐడియా."

"ఏమిటి?" అడిగాడు శివాజీ.

"నీవు పరిచయం చేసుకోవాలనుకునే అమ్మాయిని ఎక్స్‌క్యూజ్‌మి, దయచేసి మీ ఆటోగ్రాఫ్‌లు సేకరిస్తున్నాను అను. దట్ బ్రేక్స్ ది ఐస్."

చిన్నగా నవ్వి చెప్పాడు శివాజీ. "ఐ ఆల్ రెడీ బ్రోక్ ది ఐ.. ఆ అమ్మాయితో పరిచయం అయింది నాకు."

"ఎలా?"

"మీరు చెప్పిన ఐడియాలాంటిదే"

వెన్నెలని చూపించి చెప్పాడు శివాజీ.

"ఆమే"

వచ్చిన కస్టమర్స్‌ని తీసుకెళ్ళి టేబుల్స్ చూపించడం మిస్ డిసౌజా పని. ఆమె వెన్నెల కూర్చున్నాక పరిశీలనగా చూసి మనసులో అనుకుంది.

"శివాజీది మంచి ఛాయిస్" పెద్ద కళ్ళు, నల్లరంగు ఆ అమ్మాయ్ అందానికి కారణాలని అనుకుంది. ఆ చిరునవ్వులో ఏదో మేజిక్ వుందని కూడా అనుకుంది.

ఎప్పటిలా వైర్‌లెస్ మైక్ అందుకుని పాటలు పాడాడు శివాజీ. అరవ పాట 'ఏళంద పయం.. ఏళంద పయం.. చక్కచ వంద పయం..' పాడుతుంటే అది కోరిన తమిళియన్స్ బృందంలోని వారు చప్పట్లు కొట్టారు.

ఇంకో రిక్వెస్ట్‌ని చదివి చెప్పాడు శివాజీ.

"దిల్ జల్ తా హై.. తొజల్ నేదే పాటని పాడింది సైగల్ కాదు. చాలామది ఆ కంఠం విని సైగల్‌గా భ్రమపడతారు. నిజానికిది పాడింది ముఖేష్. అతను ఇంట్రడ్యూస్ అయిన రోజుల్లో సైగల్ ఇన్‌ఫ్లుయెన్స్ ప్రేక్షకుల్లో ఎంతో వుండేది. అందుచేత ఎంతో ప్రతిభావంతంగా సైగల్ గొంతుని అనుకరించి ఆ పాటని సైగల్ పాడాడనిపించేంత సహజంగా పాడాడు. కానీ చివరి చరణంలోని 'హము యాద్ లగాయే' అన్న పదంలో ముఖేష్ కంఠంలోని పాపులర్ అయిన ఆ జీర వినిపిస్తుంది. ఇంకోసారి మీరా పాట విన్నప్పుడు శ్రద్ధగా వింటే నేను చెప్పిన తేడాని గమనించగలరు."

వెన్నెలకి అది కొత్త సమాచారం కాబట్టి ఇంటికెళ్ళాక ఆ పాటని టేప్ రికార్డరులో విని శివాజీ చెప్పిన తేడాని వినాలనుకుంది. అతను దిల్ జల్ తాహై తో జల్ నేదే పాటని సైగల్ పాడినట్లుగానే పాడాడు.

ఆ తర్వాత ఓ తెలుగు వాళ్ళు కోరిన 'మల్లీశ్వరి సినిమాలోని ఊరు చేరాలి. మన ఊరు చేరాలి' పాటని పాడాడు. చివరగా వెన్నెలకోరిన పాట 'ఆడుతు పాడుతు..' పాడాడు. ఆ పాటకి ముందు చెప్పాడు శివాజీ ఇంగ్లీషులో.

"దేవదాసు పాత్రధారి దిలీప్‌కుమార్ తెలుగులో అతనికన్నా ప్రతిభావంతంగా అదే పాత్రని పోషించిన అక్కినేనిని అభినందించారు. ఆ అక్కినేని నాగేశ్వరరావు నిర్మించిన తొలి తెలుగు చిత్రంలో భార్యా భర్తలు అయిన ప్రేమికులు పాడే పాట ఇది. అలాంటి ప్రేమికులకు ఈ ఎమోషన్ అన్నారు కాబట్టి తెలుగు అర్థం కాకపోయినా కూడా ఈ పాటని చక్కగా ఎంజాయ్ చేయొచ్చు."

ఆ రాత్రి భోజనం మానేసి వెన్నెలతో దగ్గరే ఉన్న ఆమె ఇంటిదాకా నడిచాడు శివాజీ.

"మీకు పాటలమీద నుంచి కమాండ్ వున్నట్లుందే?"

"ఏదో కొంచెం. మా అమ్మ చక్కటి గాయని. ఆవిడవల్లే నాకు ఈ అభిరుచి వచ్చింది. కర్ణాటక సంగీతం నా పదహారవ ఏట దాకా నేర్చుకున్నాను. ఇప్పుడది పార్ట్ టైం సంపాదనకి పనికి వస్తోంది."

"ఈసారి 'పిలిచిన బిగువటరా' పాడండి" కోరింది వెన్నెల.

"మీకు జావళి అంటే?" అడిగింది వెన్నెల.

"ఇప్పుడు మీరు కోరిందే ఇంకోటి 'బాలనురా మదనా', మరోటి 'ఎంతటి రసికుడివో తెలిసెరా', 'అందం చూడవయ ఆనందించవయ' కూడా జావళే. జావళి అంటే తెలుసా?" అడిగాడు.

"శృంగార రసం గల పాటనా?" అడిగింది వెన్నెల.

"కొంత దగ్గరగా వచ్చారు. ప్రియుడిని ప్రియురాలు శృంగారపరముగా ఆహ్వానించే పాటని జావళి అంటారు."

"ఇంకా ఇలాటి రకాలు తెలుగు పాటల్లో వున్నాయా?"

"అష్టపదులు అందరికి తెలిసినవే. జయదేవుడు భగవంతుడిని ఉద్దేశించి భక్తిరసంతో రాసినవి. రాగమాలికంటే తెలుసా?" అడిగాడు శివాజీ.

"ఊహూ."

"ఒకే పాటలో అయిదు రాగాలుండటం 'రాగమాలిక' అవుతుంది. 'ముక్కోటి దేవతలు ఒక్కటయినారు చక్కన్ని పాపని ఇక్కడుంచారు రాగమాలిక. ఇంకోటి 'రహస్యం' సినిమాలోని 'శ్రీ లలిత శివజ్యోతి సర్వదాయని' పాట."

"నాకు మ్యూజిక్ విని ఆనందించడమే తప్ప అందులో ఏమీ జ్ఞానంలేదు."

"మా అమ్మే నాకు ఇదంతా నేర్పింది. అన్నట్లు మీరు రేపు ఉదయం మా ఇంటికి బ్రేక్ ఫాస్ట్‌కి రావచ్చుగా?"

"మీరు పిలవచ్చుగా?"

"ఇది పిలుపే. మా అమ్మ మిమ్మల్ని ఇంటికి రమ్మని ఆహ్వానించింది. రండి."

"ష్యూర్. ఎడ్రస్?"

"సముద్ర్ దర్శన్ ఫ్లేట్స్, బాంద్రా. ఫ్లాట్ నంబరు త్రి రైల్వే స్టేషన్ నుంచి 'చాప్ స్టిక్స్' రెస్టారెంట్ దాకా వస్తే దాని పక్క సందులోనే."

"రైట్. సెవెన్ థర్టీకి రానా?"

"ప్లీజ్ మేకిట్ ఎయిట్."

"డన్."

శివాజీ ఆమె ఇంటిదాకా వెళ్ళి మళ్ళీ వెనక్కి తిరిగాడు. లోకల్ స్టేషన్ వైపు నడిచాడు. ఆ రాత్రి కూడా అతను క్లబ్‌లో భోజనం మిస్ అయ్యాడు. భోజనం చేసేకన్నా ఆ సమయాన్ని వెన్నెలతో గడపడం శివాజీకి ఆనందాన్నిచ్చింది.

అండ్ దటీజ్ ది మేజిక్ ఆఫ్ క్యుపిడ్ అందుకే క్యుపిడ్‌కి స్టుపిడ్ క్యుపిడ్ అన్న నిక్‌నేమ్ వచ్చింది.

## 13

తెలతెలవారకుండానే ఆద్రిజ పవన్ ఇంట్లోంచి ఆది లక్ష్మమ్మ నిద్ర లేచేలోగా బయటికి వచ్చింది కారులో ఆమెని పవన్ హాస్టల్ బయట దింపి మళ్ళీ ఇంటికి వచ్చాడు.

"ఇంత పొద్దున్నే ఎక్కడికి వెళ్ళావురా?" అడిగింది ఆదిలక్ష్మమ్మ.

"వాకింగ్‌కి"

"కొంతకాలం అలాంటివన్నీ కట్టిపెట్టు. కుమారస్వామి వేడి చల్లారేదాకా అవసరం వుంటే తప్ప బయటికి కదలకు."

"అతనికి భయపడి గాజులు తొడుక్కుని ఇంట్లో కూర్చుంటే ఎలాగమ్మా?"

"ప్రాణానికి మించింది లోకంలో ఇంకోటుండదురా."

ఆ రోజు పార్టీ రాష్ట్ర ప్రెసిడెంట్ ఇంటికి వెళ్ళాడు పవన్. ఆయన ఇంటి సందునిండా కార్లే రాబోయే ఎలక్షన్లకు సీట్లు కోరేవారితో ఆయన ఇల్లు కిటకిటలాడుతోంది. ఆయన రికమండేషన్ కూడా ఢిల్లీలో పరిగణనలోకి తీసుకుంటారు.

నలుగురయిదుగురు విజిటర్స్ గదిలో వేచి ఉన్న పవన్‌ని పలకరించి కుమారస్వామి ప్రసక్తి తెచ్చారు.

"పేపర్లో మీ స్టేట్‌మెంటు చదివాను. బాగా యిచ్చారు. సిబిసిఐడి చేత విచారణ చేయించమన్నారంటే మీరు నిర్దోషి అన్న నమ్మకం కనబడుతోంది" అన్నాడొకాయన.

"హత్యా రాజకీయాలు అతనికి మామూలే హత్య చేసిన వాళ్ళు కుమారస్వామి శత్రువులే అయి వుంటారు. లేదంటే

బావమరిదిని తనే చంపించి అది నీ మీదకి నెట్టగల సమర్థుడు కుమారస్వామి" ఇంకొకాయన అన్నాడు.

పవన్‌కి లోపలనుంచి పిలుపు రాగానే వెళ్ళాడు. కుమారస్వామి గురించి కాసేపు చర్చ జరిగాక చెప్పాడు రాష్ట్రస్థాయి ప్రెసిడెంట్.

"ఈ గొడవ జరగకపోతే మరోలా వుండేది. జరిగింది కాబట్టి ఆ కుమారస్వామికి పోటీగా నీవే నిలుచోవాలి అని పార్టీ నిర్ణయించింది" చెప్పాడాయన.

ఆయనకి థాంక్స్ చెప్పి నామినేషన్ దాఖలు చేయడానికి అనుమతి తీసుకుని బయటికి వచ్చాడు.

పవన్ కారు ఇంటికి సగం దూరంలో ఉండగ్ ఒక ఆటో కారుకి అడ్డంగా వచ్చింది. డ్రైవరు బ్రేక్ వేసి కారాపాడు. ఆ కారుని ఓవర్ టేక్ చేసి వెళ్ళే ఇంకో ఆటోలోంచి అవిటి గోవిందం విసిరిన రెండు బాంబుల్లో ఒకటి కారుకి తగిలి బయటే కిందపడి పేలింది. ఇంకొకటి కారు ముందు సీట్లో పడి పేలింది. క్షణాల్లో కారు అంటుకుంది.

కారులో బాంబు పేలిన శబ్దానికే పవన్‌కి స్పృహ తప్పింది. ముందు సీట్లో మంటలు కారు డ్రైవరు కారుని బ్రేక్ వేసి ఆపాడు.

ఆ కారు వెనక పవన్‌కి రక్షణగా జీప్‌లో వస్తున్న అతని అనుయాయులు జీప్ నాపి క్షణం ఆలస్యం చేయకుండా కిందకి దిగారు.

కొందరు వెనక తలుపు తెరిచి షాక్‌లో వున్న పవన్‌ని బయటికి తీస్తే ఇంకొందరు బట్టలంటుకున్న డ్రైవర్ని బయటికి లాగి మంటలు ఆర్పారు.

క్షణాల్లో కారులోని మంటలు వెనక సీట్లోకి పాకాయి. సరిగ్గా రెండు నిమిషాల తర్వాత టేంక్ నించి పెట్రోల్ ఇంజన్‌కి సప్లై చేసే పైప్ బర్స్ట్ అయి కారు మొత్తం కాలిపోయింది. ఫైర్ ఇంజన్ వచ్చి శిథిలమైన కారులోని మంటలని ఆర్పింది.

అప్పటికే జీప్‌లో పవన్‌ని నిమ్స్‌కి తీసుకెళ్ళారు. దారిలోనే పవన్‌కి స్పృహ వచ్చింది.

భయంగా చుట్టూ చూస్తూ అరిచాడు.

"ఏమైంది?"

జరిగింది వివరించాడు పవన్ బెస్ట్ ఫ్రెండ్ జయరామ్.

"నీవు లేచిన వేళ మంచిదయింది. నీకేం కాలేదు" చెప్పాడు జయరాం.

నిమ్స్‌లో పవన్‌ని అడ్మిట్ చేసుకున్నారు అతనెవరో తెలియగానే డాక్టర్ అతన్ని పూర్తిగా పరిశీలించాక వీపు మీద రూపాయి బిళ్ళంత కాలినచోట కట్టిన బొబ్బని చితక్కొట్టి మందు వేసి బేండేజ్ కట్టాడు.

"నథింగ్ సీరియస్. మీరు ఇంటికి వెళ్ళచ్చు" చెప్పాడు డాక్టర్.

ఆదిలక్ష్మమ్మకి సంగతి తెలియగానే గుండెల మీద చేయిని వేసుకునిచెప్పింది.

"నువ్వు కొంతకాలం ఎటైనా వెళ్ళి ఎన్నికలయ్యాక రా."

"వాడికి భయపడితే ఎలా?" కోపంగా అన్నాడు పవన్.

రిసీవరు అందుకుని జయరామ్ వద్దంటున్నా వినకుండా కుమారస్వామి ఇంటికి డయల్ చేశాడు.

"ఆయన లేరండి. ఎవరు మీరు?" అడిగిందో కంఠం.

"ఎక్కడికి వెళ్ళారు?"

"ఉదయం ఫ్లైట్లో బొంబే వెళ్ళారు. రేపు ఉదయం వస్తారు. ఏమైనా చెప్పమంటారా?"

"అవును. పవన్ మీద ఆయన చేయించిన హత్యాప్రయత్నం సఫలం కాలేదని, ఈ విషయం మీద పోలీసులకు ఫిర్యాదు చేస్తున్నానని చెప్పండి."

"మీరెవరు?" ఆసక్తితో అడిగిందా కంఠం.

"ఆ పవన్ ని నేనే."

*(కొనసాగింపు వచ్చేనెలలో)*

Post your comments

ప్రస్తుతం అందుబాటులో ఉన్న మల్లాదిగారి పుస్తకాల వివరాల కోసం ఇక్కడ క్లిక్ చేయండి
www.anandbooks.com
www.telugubooks.in